క్లుప్తంగా...

అమ్మవారికి తొలిబోనం



మహిళలకు చీరలను అందజేస్తున్న పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట: ఆషాఢమాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా జంగమ్మెట్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం తొలి బోనం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు, టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సదా మణిశంకర్, సాయిఉదయ్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా జంగమ్మెట్ బాలభక్త ఉమ్మడి ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా గోవర్ధన్‌గౌడ్ నియమితులయ్యారు. ఆలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా కాటేపల్లి గండిస్వామి, కోశాధికారి ఎస్.రాంరెడ్డి, చైర్మన్ ఎస్.నిరంజన్‌గౌడ్, వైస్ చైర్మన్ టి.అశోక్ కుమార్, ఆడిటర్ అంబదాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. త్వరలో నిర్వహించనున్న బొడ్రాయి పండుగను పి.పాపయ్య పర్యవేక్షణలో నిర్వహించనున్నామన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పెండ్యాల లక్ష్మీనారాయణ, భరత్‌కుమార్‌గుప్తా తదితరులు

అబిడ్స్: వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. బోన్ మినరల్ డెన్సిటీ అంశంపై డాక్టర్ రాజీకుమార్ డాక్టర్ సంగీత అవగాహన కల్పించారు. ఆదివారం మెల్కోటి పార్కు వద్ద వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈ ఉచిత మెడికల్ అవగాహన నిర్వహించారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వాకింగ్, యోగా చేయాలని వివరించారు. పెండ్యాల లక్ష్మీనారాయణ, నాగభూషన్‌రావు, వరకుమార్‌గుప్తా, హరికుమార్, వినోద్‌కుమార్, రేజేష్ కోలావర్, వస సత్యనారాయణ, అడుగుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్‌లో ఆధునిక డ్రైనేజీ లైన్లు



కాలనీవాసులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పాత డ్రైనేజీ స్థానంలో అధునాతన డ్రైనేజీ లైన్లు వేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ డివిజన్‌లోని నేతాజీనగర్ కాలనీ అసోసియేషన్ వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, మంత్రి కేటీఆర్‌ల చొరవతో కార్వాన్ నియోజకవర్గానికి రూ.297 కోట్లు డ్రైనేజీ పనుల కోసం మంజూరు అయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ అసోసియేషన్ వారితో కాలనీ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు అంజిరెడ్డి, కార్యదర్శి అప్పారావు, ఉపాధ్యక్షులు మహ్మద్ సర్వర్, శ్రీధర్, కృష్ణదాస్, కార్యవర్గ సభ్యులు నరేందర్‌రెడ్డి, మహ్మద్ షాకీర్, మహ్మద్ ఆరిఫ్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

జియాగూడ: ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పంచ్‌బై అలావా ప్రాంతంలో నివసిస్తున్న సికిందర్ ఆటోడ్రైవర్. ఇతని కూతురు (18)కి 2022లో కిషన్‌బాగ్‌కు చెందిన జహంగీర్ (24) ఇతనితో నిశ్చితార్థం జరిగింది. కొన్ని కారణాల వల్ల వీరి సంబంధం తెగిపోయింది. అయినప్పటికీ జహంగీర్ యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. తీరా యువతి ఇంట్లో తెలియడంతో పెళ్లి చేసుకోవాల్సిందిగా ఆమె తండ్రి సికిందర్ జహంగీర్‌ను కోరగా పెండ్లి చేసుకోనని నిరాకరించాడు. మనస్తాపం చెందిన యువతి ఇంట్లో మధ్యాహ్నం 20కి పైగా బీపీ మాత్రలు మింగింది. అర్ధరాత్రి ప్రాంతంలో అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి జహంగీర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఘటం.. ఘనం..

వైభవంగా సామూహిక ఘట స్థాపన ఊరేగింపు





తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బోనాలు

ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు.. పోతురాజుల విన్యాసాలు

ఊరేగింపులో పాల్గొన్న ప్రధాన ఆలయాలకు చెందిన ఘటాలు

చార్మినార్: పాతబస్తీలో కాశీ విశ్వనాథ ఆలయం నుంచి భక్తిశ్రద్ధలతో ఘట స్థాపన ఊరేగింపు కొనసాగింది. ముందుగా కాశీ విశ్వనాథ ఆలయంలో అమ్మవారి ఘటాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం భాజా భజంత్రీల నడుమ సామూహిక ఊరేగింపు ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే విధంగా పాతబస్తీలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు ప్రతి ఏటా కన్నుల పండువగా జరుగుతాయి. తెలంగాణ జిల్లాలలోనే అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాలు పాతబస్తీకి ప్రత్యేకంగా నిలుస్తాయి. నిజాం కాలం నుంచి ఇక్కడి అమ్మవారి ఆలయాలలో పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన బోనంను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలోనే ఈసారి కూడా పాతబస్తీలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం పాతబస్తీ శాలిబండ కాశీ విశ్వనాథ దేవాలయం నుంచి ప్రారంభమైన అమ్మవారి ఘట స్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమం కొనసాగింది.

కళాకారుల నృత్యాలు...పోతురాజుల విన్యాసాలు..

దారిపొడవునా కళాకారుల నృత్యాలు.. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపుకు హాజరైన స్థానిక భక్తులు దారి పొడవున బారులుతీరి ఘటాలకు సాకపెట్టి టెంకాయలు కొట్టి స్వాగతం పలికారు. పాతబస్తీలోని ప్రధాన ఆలయాలకు చెందిన అమ్మవారి ఘటాలు ఈ ఊరేగింపులో పాల్గొన్నాయి. సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేశ్ తివారి ఆధ్వర్యంలోని శివ తాండవం ప్రతిమలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పాతబస్తీలో కలిసిమెలిసి ఉత్సవాలు

పాతబస్తీలో ఉత్సవాలు మతసామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం రాత్రి లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి అమ్మవారి ఘటాలకు స్వాగతం పలికారు. గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, ఉపాధ్యక్షులు బుల్లెట్ శ్రీధర్, ఎస్‌పీ క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి గాజుల రాహుల్, కమిటీ మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, రాకేశ్ తివారీ, పాటిల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ గౌడ్ పాల్గొన్నారు.

లంగర్‌హౌస్‌లో..

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌లో బోనాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రధాన ఆలయం బుజిలీ మహంకాళి ఆలయంలో ప్రతిష్ఠాపించిన ఘటాన్ని భక్తిశ్రద్ధలతో ఇంటింటికీ తిప్పుతున్నా రు. ఆలయ కమిటీ చైర్మన్ ఆరెల్ల క్రిష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మూడవ రోజు లంగర్‌హౌస్ బాపునగర్, జానకీ నగర్‌లలో అమ్మవారి ఘటాన్ని ఊరేగించారు. ఆలయ కమిటీ కన్వీనర్ నాగుల రవికాంత్, కోశాధికారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, గడ్డికరణ్ పాల్గొన్నారు.



శ్రీ దర్బార్ మైసమ్మ ఘటం ఊరేగింపు

గోల్కొండ: ఈసారి దర్బార్ మైసమ్మ బోనాలను గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ అమర్ సింగ్ అన్నారు. ఆదివారం కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఆలయం ఘటం ఊరేగింపు భారీ ఎత్తున జరిగింది. దేవర రాజేశ్వర్, నాయకులు యోగిరాజ్ సింగ్ పాల్గొన్నారు.



కాశీ విశ్వనాథ్ ఆలయం నుంచి ఊరేగింపుగా బయలు దేరిన అమ్మవారి ఘటాలు



ఘటం ఊరేగింపులో క్రిష్ణయాదవ్



మహంకాళీ మాతేశ్వరి భారతమాత, కోటమైసమ్మ ఘటం ఊరేగింపులో ఆలయ నిర్వాహకులు



శ్రీ దర్బార్ మైసమ్మ ఘటం ఊరేగింపులో అమర్ సింగ్





ఘటానికి స్వాగతం పలుకుతున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

సమాజ సేవకు జేసీఐ హైదరాబాద్ దక్కన్ కృషి

అబిడ్స్: సమాజ సేవకు జేసీఐ హైదరాబాద్ దక్కన్ విశేష కృషి చేస్తుందని జేసీఐ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ జేఎఫ్ఎస్ కార్తికేయన్ పేర్కొన్నారు. సీతారామ్‌బాగ్‌లో ఆదివారం జేసీ హైదరాబాద్ దక్కన్ సామాజిక సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు స్కూల్ కిట్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా జగన్నాథ్‌మఠంలో ఫీడింగ్ బేబీస్ రూమ్, సోలార్ వాటర్ హీటర్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్తికేయన్ మాట్లాడుతూ.. సమాజ సేవ చేయడమే తమ స్వచ్ఛంద సంస్థల ఆశయమన్నారు. జేసీఐ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షుడు జేఎఫ్ఎం రీతేష్ భరాడ్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ నలుమూలలా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విధి గుప్తా, రమేష్ దడిగాల అభినయ్ బర్మేష, మహేష్ రాతి, బిజేష్ బంగ్, సందీప్ దారక్, రితేష్ జష్నాని, విభా బర్మేష, సిదాంత్ జైన్, ప్రణీత బొగ్గారపు, సుఖేష్ జవహర్, రాహుల్ మంత్రి, ముఖేష్, కేడియా పాల్గొన్నారు.



నోట్‌బుక్స్, పుస్తకాలు పంపిణీ చేస్తున్న జేఎఫ్ఎస్ కార్తికేయన్, విధి గుప్తా

ఘనంగా బోనాలు

అబిడ్స్: బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.



నేడు పాతబస్తీలో చెక్కుల పంపిణీ

చార్మినార్: పాతబస్తీలో ఈనెల 16న నిర్వహించే ఆషాఢమాసం బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంత్రిని కలిసి ఆహ్వానం అందజేసింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మంత్రికి ఆహ్వానం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆలయాలకు ఆర్థిక సహాయం కింద రూ.15 కోట్లు కేటాయించిందన్నారు. ఈసారి ఆర్థిక సహాయం చెక్కులను ఈ నెల 10, 11వ తేదీలలో అందజేస్తామన్నారు. గాజుల అంజయ్య, రాకేష్ తివారీ, పాటిల్ సదానంద్‌యాదవ్, మధుసూదన్‌యాదవ్, రాజారత్నం, వీరేంద్రయాదవ్, హంస్ రాజ్, గాజుల రాహుల్, రాందేవ్‌కుమార్ అగర్వాల్, శశాంక్ తివారీ పాల్గొన్నారు.



మంత్రి తలసానికి ఆహ్వానం పలుకుతున్న నిర్వాహకులు

11, 14న సామూహిక బోనాలు, ఒడిబియ్యం సమర్పణ

జియాగూడ: బోనాల వేడుకల సందర్భంగా ఈనెల 11, 14వ తేదీలల్లో బీఆర్ఎస్ పార్టీ ద్వారా జియాగూడలోని మాతేశ్వరీ ఆలయాల్లో సామూహిక బోనాలు, ఒడిబియ్యం పోతరాజుల నృత్యాలతో బాజా భజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించడం జరుగుతుందని జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. ఆదివారం జియాగూడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో అధ్యక్షుడు నరహరి చారి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటైంది. మిత్రకృష్ణ మాట్లాడుతూ.. 11న జియాగూడలోని బంగారు మైసమ్మ, జియాగూడ మహంకాళీ, సంజయ్ నగర్ నల్ల పోచమ్మ, ఇందిరానగర్ నల్లపోచమ్మ, దుర్గానగర్ తుల్జా భవానీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం సమర్పణ ఉటుందన్నారు. 14న కార్వాన్ దర్బార్ మైసమ్మ, మహంకాళి మైసమ్మ, బంజావాడి తుల్జా భవానీ మందిరాల్లో బోనాలు, ఒడిబియ్యం ఊరేగింపుగా వెళ్లి సమర్పిస్తామన్నారు. శ్రీనివాస్‌గుప్తా, బాబు, మోహన్, నర్మద, సంగీత, అనితా, దిలీప్‌కుమార్, శంకర్‌రావు, సురేఖ, శాంత, ఉమేష్, కేశవ్, అనితా, చాయాదేవి, సంతోషిని, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ

ఘనంగా 57వ గోపాల్ కలా మహోత్సవం



సంజయ్ ఘనాటేను సన్మానించిన అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్ నీమ్‌కర్

జియాగూడ: జియాగూడ విఠల్ రుక్మిణీ ఆలయంలో ప్రతి యేటా గోపాల్ కాలా మహోత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడం హర్షనీయమని రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా కార్యదర్శి సంజయ్ ఘనాటే, రాష్ట్ర భవసార్ క్షత్రియ సామాజ్ అధ్యక్షుడు ఉమేష్ జైట్ని అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలో భవసార్ క్షత్రియ చారిట్రబుల్ ట్రస్ట్ జియాగూడ ద్వారా 57వ గోపాల్ కలా మహోత్సవ వేడుకలను అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్ నీమ్‌కర్, ప్రధాన కార్యదర్శి వసంత్ బాసుత్‌కర్ ఆలయంలో ఘనంగా చేపట్టారు. ముందుగా మూలవిరాట్‌కు విఠల్ రుక్మిణీలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హోమం, కేశవ స్వామి మందిరం నుంచి దహీహండీ ఊరేగింపు ఆలయానికి చేరుకోగా అకండ హారతీ అన్నదాన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. జైహింద్‌రావు బాసుత్‌కార్, జియాగూడ బవసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి శ్రీ మనోహర్, శ్యాంసుదర్, బాబూరావు, ఫకీర్‌చంద్, హాబీల్ నీంకార్, తులసీరామ్ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలి



పురస్కార గ్రహీతలతో వేదాంతం రాధ్యేశ్యామ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారతీయ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతగానో ఉందని కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యురాలు డాక్టర్ ఎస్‌పి.భారతి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో మయూరి నృత్యాలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువందన నృత్యోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళలు, కళాకారులను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలువురు నాట్య గురువులకు పురస్కారాలను ప్రదానం చేశారు. కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ వేదాంతం రాధ్యేశ్యామ్, అడిషనల్ డీసీపీ తేజావత్ రాందాస్, సినీనటి రాగిణి, సంస్థ అధ్యక్షుడు ఆర్.ఎస్. రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంతియానం' పుస్తకావిష్కరణ

నాంపల్లి: 45 మంది తెలుగు మహిళల యాత్రా కథనాలతో అన్వీక్షికి పబ్లికేషన్స్ వెలువరించిన 'ఇంతియానం' పుస్తకావిష్కరణ సభ ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. ప్రముఖ యాత్రా రచయిత ఆదినారాయణ మాచవరపు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాధవ్ ముడుంబై సభకు అధ్యక్షత వహించగా పుస్తక సంపాదకురాలు స్వర్ణ కిలారి తమ స్పందనను తెలియజేశారు. ఆదినారాయణ మాట్లాడుతూ.. ఇదొక చక్కటి ప్రయత్నమని, యాత్రలు చేసే మహిళలు తప్పక తమ అనుభవాలు అక్షరీకరించాలనే సూచన చేశారు. ఈ సందర్భంగా పుస్తకానికి సంపాదకత్వం వహించిన స్వర్ణ కిలారిని అభినందించారు. రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు పింగళి చైతన్య, సూరేపల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఇద్దరు చిన్నారులతో సహా గృహిణి అదృశ్యం

సుల్తాన్‌బజార్: గృహిణి ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైన ఘటన ఆదివారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసుదన్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ప్రియాంక(26) ఇస్మామియాబజార్‌లో నివసిస్తుంది. ఈనెల 6న సాయిబాబా గుడికి వెళ్తానని చెప్పిన ఆమె తన కుమారుడు, కూతురుతో కలిసి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆమె భర్త సునీల్ చుట్టుపక్కల ప్రాంతాలో, తెలిసిన వారి దగ్గర ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఆమె భర్త సునీల్ సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మత సామరస్యానికి ప్రతీక బోనాలు

అబిడ్స్: మత సమరస్యానికి బోనాల ఉత్సవాలు దోహదపడుతాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఆదివారం ఉస్మాన్‌గంజ్‌తో పాటు గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన బోనాల ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం నందకిశోర్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసిందన్నారు. జీహెచ్ఎంసీ, దేవాదయ, విద్యుత్, రెవెన్యూ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకులు ఉద్యమ నేత ఆర్‌వీ మహేందర్, వినోద్‌కుమార్, శేఖర్, అనిల్ జైస్వాల్, కోటి శైలేష కురుమ, పప్పుమాత్రే పాల్గొన్నారు.



వేడుకల్లో బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

'శ్రీమహావిష్ణు ఆధ్యాత్మిక సంకీర్తనలు' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న గురుమాతా బ్రహ్మానందమయి,చిత్రంలో రత్నాకర శర్మ

నాంపల్లి: శ్రీకృష్ణ ప్రసన్న తాళ్ల లక్ష్మీనారాయణగౌడ్ రాధాకృష్ణుల అనురాగ బంధాలపై రచించిన శ్రీ మహావిష్ణు ఆధ్యాత్మిక సంకీర్తనలు గ్రంథాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక గురుమాతా బ్రహ్మానందమయి ఆవిష్కరించారు. సైన్స్ సొల్యూషన్స్, తాళ్లపాక అన్నమయ్య సంగీత కళానిలయం సంస్థలు సంయుక్తంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళా మందిరంలో నిర్వహించిన సభ సీనియర్ పాత్రికేయులు రత్నాకర శర్మ అధ్యక్షతన సభారంజకమై సాగింది. లక్ష్మీనారాయణగౌడ్ ఒక కారణ జన్ముడని, అన్నమయ్య స్ఫూర్తిగా ఆ శ్రీ కృష్ణ భగవానుడు పలికించిన 32వేల పదహారు కీర్తనలు రాసి ఆధ్యాత్మిక రంగంలో ఒక సంచలనం సృష్టించాడని రత్నాకర శర్మ అన్నారు. విఖ్యాత ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ.. ఈ ఆధునిక యుగంలో గౌడ్ చేసిన రచన ఒక చరిత్ర సృష్టించిందన్నారు. సైన్స్ సొల్యూషన్ అధినేత మృత్యుంజయ్ గౌడ్, సమన్వయ కర్తగా నిలిచి వందన సమర్పణ చేశారు.